# ఋణాదా! శరధీ! కరుణాపయోనిధీ!

ఎవ్వనిచే జనించు ఋణ
మెవ్వనిచే భ్రమియించు లోకమం
దెవ్వని బుద్ధియే ఋణద
మెవ్వడు నవ్వుచు నప్పొలిచ్చు దా
నివ్వగ జాలనం చనక
నివ్వగ జాలకఁ దిప్పనట్టి వా
డెవ్వడు - ఆ ఋణాత్మ్మ, ఋణదేశ్వరు
నేను ఋణంబు వేడెదన్.

ఒక సూర్యుండు సమస్త జీవులకు
దా నొక్కొక్కడై దోచు న
ట్లొకటే రూక ధనమ్ముగా ఋణముగా
నొక్కొక్కచోఁ శిక్షగా
నొకచో రక్షగ, లక్షగా, తృణముగా
నొక్కొక్కటై దోచుగా
కొకటే సత్యము- ఓర్తిరూకసుడీ!-
అప్పొప్పల్ అపోహల్, భ్రమల్.

ఋణ ఋగ్వేదికి వాదికి
ఋణకారణ జన్మ్మడైన ఋణఖాదికి దా-
ఋణబుద్ధికి ఋణసిద్ధికి
ఋణభ్రమాభ్రమరునకును ఋణికిన్ ఘృణికిన్.

వ. ఋణతరుణ వందన సహస్రం బాచరించి, నా యొనర్పం బూనిన శతక ప్రకారంబు.... ఒక్క నిముషం; ముందు నా మనవోఁటి వినండి. తరవాత అసలు విషయానికి రావచ్చు.

కబ్బము చేయుచుంటి నిది
కాగనె, యచ్చుకు బంపగానే, మా
సుబ్బయ డబ్బు పంపగనె-
సుబ్బయ తప్పక పంపులెమ్ము-నీ
డబ్బుల నిత్తుగాని, యొక డెబ్బది-

ఈ యతివల్ల-నిమ్మ్క, లే
దబ్బ యనంగబోకు
ఋణదా! శరధీ! కఋణాపయోనిధీ!

అప్పాలు చాల చేసితిని య్యర్థత
లేదనబోకు లోకమం
దప్పాలు తప్పాలు న్నెరుగనేరని
వారెవరైన నుందురే
అప్పాలస్వామి యా వరుణు; డప్పాల
కుప్పలు మేఘవార్నిధుల్-
తప్పగునా ఋణంబు? ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

సాగరు 'డప్పా'చేసి ఋణసాగరు
డైనను నిచ్చు వాహినుల్
నాగతి చూడవా! యనెదు
నాగటిచాలున కీవు; కావునన్
ఈగతి నప్పా చేసితిని ఇమ్మిక
నమ్మిక నప్పా దాచినన్
దాగని దానశీల! ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

'నాకడ నప్పా చేయుటగునా'
యని నవ్వుకొనంగబోకు మీ
లోకమునందు పారు నదులన్నిట
వార్నిధి యప్పాబీల్చగా
నా కడలి న్నగస్త్యముని యక్కటు!
పుక్కిటబట్టి నిల్పలే
దా? కఋణాసముద్ర! ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

పూవుల నుండి తేటులును
పున్నమి చందురు నుండి కల్వలున్
గోవులనుండి వత్సములు
కోమలి మోవిని యాని కామియున్-
తావుల తేనె, వెన్నెలను,

తీయని పాలు, సుధారసంబులన్
ఏవిధి నశ్రమంబుగ
గ్రహించెడి-నట్టుల నిప్పుడేను నీ
తావున నప్పుగొందు ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

(తమరు ఋణదానం చేసే పర్యంతం బండి కదలదు. ఋణగుణ ధ్వని చప్పున చల్లారిపోతుంది గాన వెంటనే వో దేవా! తామీ విషయం బాలోచించగలరు.)




★ ★ ★